సాక్షి అనకాపల్లి

మంగళవారం । 10 । జనవరి । 2023



అర్జీలకు సత్వర పరిష్కారం

కలెక్టరేట్ స్పందనకు 162 అర్జీలు వచ్చాయి. అర్జీదారులు మళ్లీ రెండోసారి రానవసరం లేకుండా పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. 8లో



సంక్రాంతి సంబరాలు 8లో

చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగవల్లికలు కనువిందు చేశాయి.

నేటి నుంచి సింహగిరిపై ధారోత్సవాలు



సింహాచలం: సింహగిరిపై మంగళవారం నుంచి ధారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు ఆర్జిత నిత్యకల్యాణం రద్దు చేశారు.

న్యూస్‌రీల్

నిర్ణీత ధరకు ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిర్ణీత ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. కశింకోట రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు అందివ్వాలన్నారు. క్వింటాకు నాణ్యమైన ధాన్యానికి రూ.2,060, రెండో రకం ధాన్యానికి రూ.2,040 వంతున ప్రభుత్వం మద్దతు ధరను అందిస్తుందన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రామారావు, మండల వ్యవసాయాధికారి ఎం.స్వప్న పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న విదేశీయులు



సింహాచలం : అంతర్జాతీయ జగద్గురు పీఠం ఆధ్వర్యంలో ఈనెల 11నుంచి నగరంలోని అంకోసాలో జరగనున్న గురుపూజోత్సవానికి విదేశీ సాధకులు సోమవారం సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. జగద్గురుపీఠం డైరెక్టర్ రవిశంకర్ తదితరులు విదేశీయుల వెంట ఉన్నారు.

ఆయుర్వేదం ఎంతో మేలు



నర్సింగ్ విద్యార్థులతో వైద్యాధికారి లావణ్య

అనకాపల్లి టౌన్: ఆయుర్వేదంలో వివిధ రకాల వ్యాధులకు చక్కని వైద్యం ఉందని జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుష్ విభాగం వైద్యాధికారి కె.లావణ్య చెప్పారు. వైద్యాలయం ఆవరణలో సోమవారం నర్సింగ్ విద్యార్థులకు ఆయుర్వేదంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉచితంగా ఆయుర్వేద మందులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కరోనా వంటి విపత్తుల్లో ఆయుర్వేద వైద్యం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఆయుర్వేద మందులను ప్రభుత్వం ఉత్తరాఖండ్ నుంచి తీసుకుని వస్తున్నట్లు చెప్పారు.

రైతు సేవా కేంద్రాలకు దరఖాస్తులు

తుమ్మపాల: రైతు సేవ కేంద్రాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్ పి.చంద్రశేఖర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక ఆగ్రో రైతు సేవా కేంద్రం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయించవలసి ఉంటుందన్నారు. పట్టభద్రులైన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీలోగా నిర్వాహకుడి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 95509 22465, 86589 90258 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

విశాఖ-సికింద్రాబాద్ మధ్య సంక్రాంతి స్పెషల్స్


తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య పలు స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-సికింద్రాబాద్ (08505) సంక్రాంతి స్పెషల్ విశాఖలో ఈనెల 11,13,16 తేదీల్లో రాత్రి 7.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో ఈనెల 12,14,17 తేదీల్లో రాత్రి 7.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఇరుమార్గాల్లో దువ్వాడ, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, కాజీపేట, జనగాం స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లు 6-సెకండ్ ఏసీ, 12-థర్డ్ ఏసీ, 1-సెకండ్ క్లాస్ కమ్ లగేజీ కమ్ దివ్యాంగులు, 1-జనరేటర్ మోటార్‌కార్ కోచ్‌లతో ప్రయాణిస్తాయి.



తవ్వకాల వల్ల బలహీనపడుతున్న గట్లు

- పోలవరం కాలువలో యథేచ్ఛగా రియల్టర్ల తవ్వకాలు
- బలహీనపడుతున్న గట్లు.. పొంచి ఉన్న ముప్పు
- వర్షాల సమయంలో గ్రామాల్లోకి వరద నీరు

గట్లను తవ్వేసి.. మట్టిని తరలించి..



పీఎల్ పురం వద్ద పోలవరం కాలువ మట్టిని తవ్వేస్తున్న దృశ్యం

నక్కపల్లి: పోలవరం కాలువకు ప్రమాదం పొంచి ఉంది. కాలువ నిర్మాణంలో వచ్చిన మట్టిని, గ్రావెల్‌ను గట్టుపై వేసి కాలువకు రక్షణగా ఏర్పాటు చేస్తే కొంతమంది రియల్ ఎస్టేట్ **వ్యాపారులు, అక్రమార్కులు** ఈ మట్టి గ్రావెల్‌ను **తరలించుకుపో**తున్నారు. మట్టి, గ్రావెల్‌తోపాటు **తవ్వకాల్లో** వచ్చిన రాయిని సయితం తరలించి బ**యటి వ్యక్తులకు విక్ర**యించి లక్షలాది రూపాయలు **ఆర్జిస్తున్నారు. అధికా**రుల పర్యవేక్షణ కొరవడటం **వల్లే ఈ దుస్థితి ఏర్ప**డిందన్న విమర్శలు వ్యక్తమ**వుతున్నాయి. నిత్యం** వందలాది ట్రాక్టర్లతో తరలిపో**తున్న ఈ ఖనిజ సం**పదను కాపాడే ప్రయత్నాలు **అధికార యంత్రాంగం** చేయడం లేదన్న విమర్శలు **వ్యక్తమవుతున్నాయి.** గ్రావెల్, రాయి అక్రమ **తవ్వకాలపై ప్రజలు** ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత **శాఖల వారు పట్టిం**చుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 5, 6, 7 ప్యాకేజీల కింద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణాన్ని పాయకరావుపేట నుంచి కశింకోట వరకు సుమారు 50 కిలోమీటర్ల మేర చేపట్టారు. పనులు దాదాపు 60 శాతం పూర్తయ్యాయి. కాలువ తవ్వకాల్లో వచ్చిన మట్టిని కంకర, గ్రావెల్ పక్కనే వేసి గట్లు ఏర్పాటు చేశారు. సుమారు 20 నుంచి 30 అడుగుల ఎత్తున ఈ గ్రావల్‌తో పటిష్టమైన గట్లు ఏర్పాటు చేస్తే అక్రమార్కుల కళ్లు ఈ గట్లపై పడ్డాయి. ఈ గట్లను తవ్వేసి గ్రావెల్‌ను మట్టిని తరలించుకుపోయి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేస్తున్నారు. ఇళ్లు, భవనాలు, ఇతర నిర్మాణాల్లో పునాదులను నింపేందుకు, లేఅవుట్లలో రోడ్లు నిర్మించేందుకు ఈ గ్రావల్‌ను తరలిస్తున్నారు. పాయకరావుపేట మండలంలో పీఎ**ల్‌పురం, సీతారామపురం, పాయకరావుపేట సమీపంలో తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలు,** నక్కపల్లి మండలంలో దేవవరం, గొడిచర్ల, గుల్లిపాడు రమణయ్యపేట, పెదదొడ్డిగల్లు, సీతంపాలెం, ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నం, దార్లపూడి, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, యలమంచిలి మండలం ఏటికొప్పాక, కొక్కిరాపల్లి, కొత్తలి, ఎర్రవరం తదితర తదితర గ్రామాల్లో నిత్యం వందలాది ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నా పోలవరం ప్రాజెక్టు అధికారులుగాని, రెవెన్యూ, మైనింగ్ అధికారులుగాని పట్టించుకోలేదని సమీప గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. గ్రావెల్, మట్టి, రాయి తరలించుకుపోవడం వల్ల గట్లు బలహీనపడి భారీ వర్షాలు, తుఫానులు వచ్చినప్పుడు వర్షపు నీరు గ్రామాల్లోకి వచ్చే ప్రమాదముందని సమీప నివాస ప్రాంతాలవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఎల్ పురంలో అయితే కాలువ గట్టుకు ఆనుకుని **కొండను కూడా వదలడం లేదని పొక్లెయిన్లు, మనుషులను పెట్టి తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలిం**చుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా అక్రమంగా తరలించిన గ్రావెల్ మట్టి, రాయిని బయట విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్ రూ.800ల నుంచి రూ.1200లకు విక్రయిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు వేసే లేఅవుట్లతోపాటు, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో ఉన్న కంపెనీలకు విక్రయించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. కాలువ మట్టి, గ్రావెల్ పరిరక్షించాల్సిన బాధ్యత, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులదే అయినప్పటికీ వారెవరూ ఈ కాలువగట్ల వైపు కన్నెత్తి చూడకపోవడంతో రియల్టర్ల అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. చందనాడ, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట, అమలాపురం, మూలపర పాటిమీద, గునిపూడి, పాయకరావుపేట మండలంలో పెంటకోట, సత్యవరం, పెద్దిపాలెం, గోపాలపట్నం తదితర **గ్రామాల పరిధిలో ఉన్న కొండల నుంచి కూడా గ్రావెల్‌ను అనధికారికంగా తవ్వకాలు జరుపుతు**న్నారు.

తవ్వకాలకు అనుమతి లేదు

కాలువ పరిధిలో ఐదు మండలాల్లో ఎక్కడా కాలువ నుంచి గ్రావెల్, మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. అనధికారికంగా గ్రావెల్, మట్టి తరలించుకుపోతున్నారు. ఈ విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై ఆయా మండలాల్లో తహసీల్దార్లు, పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నాం. ఎవరైనా పట్టుకుని మాకు అప్పగిస్తే పెనాల్టీ విధిస్తాం. ఇక నుంచి పాయకరావుపేట నుంచి యలమంచిలి వరకు కాలువ మట్టి తవ్వకాలపై ప్రత్యేక నిఘా పెడతాం. కాలువకు గట్లుగా వేసిన మట్టిని గ్రావల్‌ను తవ్వడం చట్టరీత్యా నేరం.

–వెంకటరావు, ఏఈఈ, పోలవరం ప్రాజెక్టు

వైజాగ్ టు హైదరాబాద్..

- మరో రెండు ఎయిర్ ఏసియా ఫ్లైట్లు
- ఫిబ్రవరి 13 నుంచి ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం-హైదరాబాద్‌ల మధ్య మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఎయిర్ ఏసియా సంస్థ వీటిని రోజుకు రెండు సర్వీసులు చొప్పున నడపనుంది. ఫిబ్రవరి 13 నుంచి ఒకటి, మార్చి మూడో తేదీ నుంచి మరొక విమాన సర్వీసును ప్రారంభించనుంది. ఫిబ్రవరి 13న ప్రారంభమయ్యే మొదటి విమానం ఉదయం 7.55 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 8.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరిగి ఈ విమానం 9.15 గంటలకు బయల్దేరి 10.30 గంటలకు చేరుతుంది. అలాగే మార్చి 3వ తేదీ నుంచి నడిచే మరో విమానం విశాఖలో సాయంత్రం 3.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 4.40 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది. అదే విమానం సాయంత్రం 5.15 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 6.10 గంటలకు విశాఖ వస్తుంది.

రైవాడలో 3 లక్షల చేప పిల్లల విడుదల నేడు

దేవరాపల్లి: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో మంజూరైన టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్ ద్విచక్ర వాహనాలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు మంగళవారం మారేపల్లిలో పంపిణీ చేస్తారని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.ఆర్. ఆశాజ్యోతి సోమవారం తెలిపారు.

మధ్యాహ్నం 12 గంటలకు రైవాడ జలాశయంలో 3 లక్షల చేప పిల్లలను విడుదల చేస్తారన్నారు.

మార్చి నెలాఖరులోగా ప్రభుత్వ భవనాలు పూర్తి

- రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలునాయక్
- మేడిచర్లలో సచివాలయ సముదాయాల పరిశీలన



మేడిచర్ల-రొంగలినాయుడుపాలెం తారురోడ్డును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ బాలునాయక్

కె.కోటపాడు: నిర్మాణంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలన్నీ మార్చి నెలాఖరులోగా పూర్తయ్యేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలు నాయక్ తెలిపారు. మేడిచర్ల-రొంగలినాయుడుపాలెం గ్రామాల మధ్య నిర్మాణం పూర్తి చేసుకున్న తారురోడ్డును ఆయన సోమవారం పరిశీలించారు. ఏడున్నర మీటర్ల పొడవైన రోడ్డును పూర్తి నాణ్యతా ప్రమాణాలతో నిర్మించడంతో ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మేడిచర్లలో ఇటీవల ప్రారంభించిన సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నూతన భవనాలను ఈఎన్‌సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 10,917 సచివాలయాల్లో 5,398 భవనాలు పూర్తవ్వగా, 2200 నిర్మాణం చివరి దశలో ఉన్నాయని తెలిపారు. 10,243 రైతు భరోసా కేంద్రాల్లో 3,593 భవనాలు పూర్తవ్వగా.. 1600 భవనాల నిర్మాణాలు చివరిదశలో ఉన్నాయని, 8,320 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలలో 2,000 భవనాల నిర్మాణం పూర్తవ్వగా.. 1500 నిర్మాణాలు చివరిదశలో ఉన్నట్లు ఆయన తెలిపారు. కొద్ది రోజుల్లోనే కాంట్రాక్టర్లకు రూ.444 కోట్లు చెల్లించేలా చర్యలను తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట విశాఖపట్నం పంచాయతీరాజ్ ఎస్ఈ రవీంద్ర, డీపీఆర్‌ఈవో వీరన్ననాయుడు, పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసరావు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ ప్రసాద్, డీఈ రమణమూర్తి, మాడుగుల పీఆర్ డీఈ రమణ, ప్రాజెక్ట్స్ డీఈ వెంకటరావు, జేఈలు బాలాజీ అప్పారావు, రామ్మూర్తి, శేషయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

హామీల అమల్లో జగన్ రికార్డు

- ప్రజా సంకల్పయాత్రలోనే నవరత్నాలకు నాంది
- సువర్ణ పాలనతో రాష్ట్ర ప్రజల బతుకుల్లో కొత్త వెలుగు
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- ఘనంగా పాదయాత్ర వార్షికోత్సవం



పాదయాత్ర వార్షికోత్సవంలో కేక్ కట్ చేసిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ మేరకు పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గరిశింగి పంచాయతీ శివారు చినగంగవరంలో సోమవారం సంబరాలు జరిపారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు కేక్ కట్ చేసి మహిళలకు, పార్టీ నేతలకు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాదయాత్రలో కోట్లాదిమంది పేద ప్రజల గుండె చప్పుడును విని నేను విన్నాను...నేను ఉన్నాను అంటూ కొండంత భరోసానిచ్చారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటిని నవరత్నాల పేరిట ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి దాదాపు శతశాతం అమలు చేసిన ఘనత దేశ చరిత్రలో సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలనను చేర్చి గాం.ధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చారన్నారు.

ఆయన తండ్రి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ రాజ్య సాధనే లక్ష్యంగా చేపట్టిన పాదయాత్ర దేశ రాజకీయాల్లో సంచలనంగా నిలిచిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 151 సీట్లతో అఖండ విజయం సాధించి జనం మెచ్చిన నాయకుడిగా సువర్ణ పాలన సాగిస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌ను గతం కంటే అత్యధిక సీట్లతో గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక సర్పంచ్ గూడెపు రాము, ఎంపీటీసీ కోలా గోపి, భుగత వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయిలో వైద్య సేవలు





మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, చిత్రంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, సమావేశానికి హాజరైన వివిధ జిల్లా వైద్య అధికారులు

- దేశంలోనే వినూత్నం 'ఫ్యామిలీ ఫిజీషియన్'
- ఆస్పత్రుల్లో ఖాళీలన్నీ భర్తీ
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని
- ఉత్తరాంధ్ర వైద్యశాఖ అధికారులతో సమీక్ష

మహారాణిపేట (విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తున్నామని, ముఖ్యమంత్రి మరో అడుగు ముందుకేసి దేశం గర్వించదగ్గ బృహత్తర కార్యక్రమం 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని పేర్కొన్నారు. సోమవారం వీఎంఆర్డీఏ ఎరీనాలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబుతో కలిసి ఉత్తరాంధ్ర వైద్యశాఖ అధికారులతో ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్, విలేజ్ హెల్త్ క్లినిక్స్, అర్బన్ హెల్త్ క్లినిక్స్, వెక్టర్ కంట్రోల్ హైజీన్ మెజర్స్, ఎపిడమిక్ డిసీజ్ సర్వేలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం అందించాలన్నదే 'ఫ్యామిలీ ఫిజీషియన్' ఉద్దేశమని చెప్పారు. వైద్య శాఖలో పూర్తిస్థాయి సిబ్బంది నియామకాలకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. మూడేన్నరేళ్లలో 47 వేల పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఎక్కడా మందుల కొరత లేదని వెల్లడించారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు విస్తృతంగా, సంతృప్తి స్థాయిలో అందుతున్నాయన్నారు. కేజీహెచ్ అభివృద్ధిలో కలెక్టర్ మల్లికార్జున చూపిన చొరవకు అభినందనలు తెలిపారు. ఒక్కో వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం కలెక్టర్ ప్రత్యేకంగా నిధులు ఇచ్చారని అన్నారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ నిరుపేదల కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగంలో ఏపీని మొదటి స్థానంలో నిలపడం ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. కేజీహెచ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విశాఖ కలెక్టర్ మల్లికార్జునను అభినందించారు. జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున మాట్లాడుతూ కేజీహెచ్, ఇతర ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి గాను పలు కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. రూ.3.3 కోట్ల సీఎస్ఆర్ నిధులను వెచ్చించి వివిధ పనులను నిర్వహించామన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలలో సిబ్బందిని భర్తీ చేయాలన్నారు. రూ.40 లక్షల సీఎస్ఆర్ నిధులతో పాడేరు ఏరియా ఆస్పత్రిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చినట్లు తెలిపారు. తద్వారా ఏజెన్సీలో గతంలో ఎన్నడూ లేని విధంగా 600 సర్జరీలు పూర్తి చేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించే క్రమంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్‌లు సంయుక్తంగా కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్, ఆరోగ్య శ్రీ ముఖ్య నిర్వహణ అధికారి హరీంద్ర ప్రసాద్, ఏపీ డీఎంఈ డాక్టర్ వినోద్ కుమార్, విశాఖ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆరు జిల్లాల నుంచి వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డీసీహెచ్ఎస్‌లు పాల్గొన్నారు.

పండగలా అటవీ హక్కు పత్రాల పంపిణీ

- 550 ఎకరాలకు పంపిణీ చేశాం : ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



గిరిజనులను అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వడమే కాకుండా వైఎస్సార్ రైతు భరోసా సాయం ఇస్తామని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. సరుగుడు, సుందరకోట పంచాయతీ పరిధిలో 16 గ్రామాలకు చెందిన 233 మంది గిరిజనులకు 550 ఎకరాలకు సంబంధించి అటవీ హక్కు పత్రాలను సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. నాతవరం మండలంలో మొదటి విడతగా 412 మంది గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇచ్చామన్నారు. వీరికి ఇటీవల వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తించిందన్నారు. ఇంకా ఎవ్వరికైనా అటవీ హక్కు పత్రాలు రాకపోతే మరలా సర్వే చేసి ఇస్తామన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, తహసీల్దార్ పి.కనకారావు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, సర్పంచ్ గొలగాని రాణి పాల్గొన్నారు.

తులసీరావు కుటుంబానికి మంత్రి ధర్మాన పరామర్శ



ఆడారి తులసీరావు చిత్రపటానికి మంత్రి ధర్మాన నివాళులు

యలమంచిలి: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు చిత్రపటానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం యలమంచిలిలో నివాళులర్పించారు. తులసీరావు కుమారుడు, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసీరావు పాడి రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, విశాఖ డెయిరీ ద్వారా ఉత్తరాంధ్రలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. సేవాభావం కలిగిన వ్యక్తని, పాల దిగుబడిలో నూతన ఒరవడి సృష్టించారని అన్నారు. తులసీరావు మరణం రైతులకు తీరని లోటన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన పీఆర్ ఈఎన్‌సీ



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్

దేవరాపల్లి: ఎంజీఎన్ఆర్ఈజీఎస్, నాబార్డు నిధులతో చేపడుతున్న నిర్మాణ పనుల్లో పక్కాగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర పంచాయతీరాజ్ నూతన ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా నియమితులైన బాలునాయక్ సోమవారం తారువ క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామాల్లో పనులను పర్యవేక్షించాలని, తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న పనులకు వ్యత్యాసం తెలుస్తుందన్నారు. పీఆర్ ఎస్ఈ రవీంద్ర, ఈఈలు కె. శ్రీనివాస్, కె. వీరన్నాయుడు, ప్రసాద్, డీఈ టి.రమణ పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ



కటకటాలకు ఉండే హుండీ మాయమైన దృశ్యం

రావికమతం : చినపాచిల గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయం హుండీ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. ఆ ఆలయ గేటుకు వెల్డింగ్ చేసిన హుండీని గుర్తు తెలియని దొంగలెవరో ఎత్తుకు పోయారని ఆ ఆలయ కమిటీ సభ్యులు రావికమతం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు సోమవారం ఆలయాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు. ఆ హుండీలో సుమారు రూ.2వేల వరకూ ఉండవచ్చని మొత్తం హుండీతోనే ఎత్తుకు పోయారని గ్రామస్తులు ఎస్ఐకు వివరించారు.

రెండోసారి అర్జీలు రాకుండా పరిష్కారం

- అధికారులకు జేసీ కల్పనాకుమారి ఆదేశం
- కలెక్టరేట్‌లో స్పందనకు 162 అర్జీలు

తుమ్మపాల: స్పందన అర్జీలకు స్పష్టమైన సమాధానాలు తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమంలో ఆమెతో పాటు డీఆర్వో పి.వెంకటరమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందన ఫిర్యాదులకు కొన్ని శాఖల నుంచి స్పష్టమైన సమాధానాలు ఇవ్వకపోవడం మూలంగా అర్జీదారులు మళ్లీ తమ సమస్యలను స్పందనలో పెడుతున్నారని పెదవి విరిచారు. డీఆర్వో వద్దకు వచ్చిన దివ్యాంగుల సమస్యలపై ఆరా తీసి సాధ్యమైనంత వరకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. మొత్తం 162 అర్జీలు నమోదయ్యాయి.

పింఛను మంజూరు చేయాలని వినతి

నక్కపల్లి మండలం చినదొడ్డిగుల్లు గ్రామానికి చెందిన నాకు పక్షవాతంతో కాళ్లుచేతులు పనిచేయడం లేదు. 71 శాతం అంగవైకల్యం ఉందని సదరం పత్రం మంజూరు చేశారు. పింఛను కోసం దరఖాస్తు చేస్తే తొమ్మిదేళ్ల క్రితం పెళ్లయిన తన కుమార్తె పేరున కారు ఉందని చెబుతున్నారు. నేను నా భార్య మాత్రమే జీవిస్తున్నాం. మాకు వేరుగా రేషన్‌కార్డు ఉంది. పింఛన్ మంజూరు చేయాలని రెండో సారి కలెక్టర్‌కు అర్జీ పెట్టానని, కరుణించాలని తంతటి బాబూరావు వేడుకున్నాడు.

దివ్యాంగ కోటాలో ఉపాధి కల్పించాలని వేడుకోలు

నేను బీఏ, బీఈడీ పూర్తి చేశాను. దివ్యాంగుడినైన నాకు ఏ రంగంలోనూ ఉపాధి దొరకడం లేదు. అధికారులైనా స్పందించి ఉపాధికి అవకాశం కల్పిస్తారని ఇప్పటికి ఎనిమిదో సారి కలెక్టరేట్‌కు వచ్చాను. అని



డీఆర్వో వెంకటరమణకు మొరపెట్టుకుంటున్న దివ్యాంగుడు రాపేటి భాస్కరరావు

అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి రాపేటి భాస్కరరావు డీఆర్వోకు మొరపెట్టుకున్నాడు. దానికి స్పందించిన ఆయన స్కిల్ డెవలప్‌మెంట్, దివ్యాంగ, ఉపాధి అధికారులను పిలిచి ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ ద్వారా తక్షణమే ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోలీసు స్టేషన్లలో దివ్యాంగుల సెక్షన్ 92ఏ అమలు చేయాలని నిరసన

అన్ని పోలీస్ స్టేషన్లలో దివ్యాంగుల హక్కుల చట్టం సెక్షన్ 92ఏను అమలు చేయాలని కోరుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు త్రిచక్ర వాహనాలపై ప్లకార్డులు పట్టుకుని కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. దివ్యాంగులపై దాడులు, వేధింపులపై విచారణ చేసి సెక్షన్ 92ఏ కింద కేసులు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్ల వీరుయాదవ్ వాపోయారు. నిరసనలో మేరుగు నూకరాజు, కోరిబిల్లి సోమునాయుడు, మొల్లి చంద్రశేఖర్ ఉన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

నక్కపల్లి మండలం ఉద్దండపురంలో దళితులపై మారణాయుధాలతో హత్యాయత్నం చేసిన సర్పంచ్, తదితరులను తక్షణమే అరెస్టు చేయాలని విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఐక్యవేదిక ప్రతినిధులు కలెక్టరేట్ ఎదుట నిరసన చేశారు. పోలీసులు నిందితులకు వత్తాసు పలకడం సరికాదన్నారు. దళితులను కుల దూషణ చేయడం ఐపీసీ సెక్షన్ 205, 505 ప్రకారం తీవ్ర నేరంగా పరిగణించాలన్నారు. ఐపీసీ 307 కింద చర్యలు తీసుకోవాలని జేసీ, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. దళిత సంఘం ఐక్యవేదిక నాయకులు మర్ర చంద్రశేఖర్, గోడి వెంకటేశ్వరరావు, చెక్క రాంబాబు, యర్రంశెట్టి వరలక్ష్మి, బాధితులు పులి నూకరాజు, పల్లి గోవింద పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 25 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 25 అర్జీలు వచ్చినట్టు అదనపు ఎస్పీ(పరిపాలన)బి.విజయభాస్కర్ తెలిపారు. అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటూ, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడారు. ఆస్తి తగాదాలు, ఛీటింగ్ తదితర అర్జీలు వచ్చాయని, చట్ట పరిధిలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అర్జీదారులకు న్యాయం చేస్తామన్నారు.

పొదుపు ఖాతా నుంచి రూ.80 వేలు మాయం

- డ్వాక్రా సంఘ సభ్యుల నిరసన



ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

మునగపాక : ఎస్‌బీఐ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మండలంలోని కాకరాపల్లికి చెందిన డ్వాక్రా సభ్యులు సోమవారం ఆందోళన నిర్వహించారు. తమ గ్రూపునకు సంబంధించిన పొదుపు ఖాతా నుంచి రూ.80వేలు మాయం కావడంతో వారు ఆందోళన చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకరాపల్లికి చెందిన శ్రీ వరలక్ష్మి డ్వాక్రా సంఘం ఏళ్ల తరబడి నిర్వహణ జరుగుతుంది. సోమవారం తమకు రుణం అందించాలని కోరుతూ బ్యాంక్ మేనేజర్ కృష్ణారావును కలిశారు. గతంలో అందజేసిన డాక్యుమెంటేషన్ పత్రాలు కనిపించడం లేదని కొత్తగా డాక్యుమెంటేషన్ చేసుకోవాలని గ్రూపు సభ్యులకు ఆయన నచ్చచెప్పేందుకు యత్నించారు. దీంతో సంఘ సభ్యులు డాక్యుమెంటేషన్‌కు సంబంధించిన పత్రాలు కనిపించకపోవడం ఏంటని బీఎంను ప్రశ్నించారు. అలాగే తమ పొదుపు అకౌంట్‌లో రూ.లక్షా 80 వేలు ఉండాలని నేడు కేవలం రూ.లక్ష చూపిస్తుందని మిగిలిన రూ.80వేలు ఏమయ్యాయని అన్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్‌బీఐ ఎదుట నిరసనకు దిగారు. దీంతో స్పందించిన మేనేజర్ కృష్ణారావు మాట్లాడుతూ నగదు లావాదేవీలకు సంబంధించి వివరాలు సేకరించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కొన్నిసార్లు డాక్యుమెంటేషన్ పత్రాలు కనిపించడం లేదని ఇందుకు కంగారుపడాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా డాక్యుమెంటేషన్ చేస్తామన్నారు.

అయ్యన్న.. పింఛన్ల సొమ్ముపై దుష్ప్రచారమా?

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడికి మతిభ్రమించిందని, పనికిమాలిన ఆరోపణలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పట్టణంలోని సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛన్ల సొమ్ము జమ చేసిన విషయాన్ని తెలుసుకోకుండా, రాజకీయ స్వలాభం కోసం ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ముందు పింఛన్‌దారులను అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. టీడీపీ హయాంలోనే దుర్మార్గమైన పాలన అందించారన్నారు. ఆనాడు అన్ని వర్గాలను మోసం చేసింది చంద్రబాబు, అయ్యన్నపాత్రుడే అని దుయ్యబట్టారు. అన్నా క్యాంటీన్ల గురించి మాట్లాడే అర్హత అయ్యన్నపాత్రుడికి లేదన్నారు. రూ.2లకే టిఫిన్, రూ.5లకే భోజనం పెడతామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చి, 2019 ఎన్నికలు ఆరు మాసాలకు ముందు అన్నా క్యాంటీన్లు తెరిచారని విమర్శించారు. ప్రజలు మీ మాయలో పడే రోజులు పోయాయన్నారు. ఇంటికొక ఉద్యోగాన్ని ఇస్తానని నిరుద్యోగులను మోసం చేశారన్నారు. తిక్కతిక్కగా మాట్లాడితే తిక్క కుదిరిస్తామని హెచ్చరించారు. మరో 30 ఏళ్లు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. అయ్యన్నపాత్రుడు లాంటి వారు ఎన్ని ఆరోపణలు చేసినా 2024లో సీఎం జగన్ ప్రవాహంలో కొట్టుకుపోవటం ఖాయమన్నారు.

ఏపీ బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మారేషు



ఆర్.కృష్ణయ్య నుంచి నియామక ఉత్తర్వులు అందుకుంటున్న మారేషు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఏపీ బీసీ సంఘం అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా అచ్యుతాపురం మండల గొర్లె ధర్మవరానికి చెందిన పెంకె మారేషు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. యలమంచిలి నియోజకవర్గ యాతకుల అధ్యక్షుడిగా పనిచేసిన మారేషుకు జిల్లా స్థాయిలో పదవి రావడం పట్ల కల్లు గీత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని కల్లు గీత కార్మికులకు అండగా ఉంటానని, బీసీల అభివృద్ధికి పాటు పడతానని మారేషు ఈ సందర్భంగా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గీత కార్మికులకు ప్రమాద బీమా పెంచారన్నారు.

బీసీ సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పిరమళ్ల

పాయకరావుపేట: ఏపీ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలో కుమారపురం గ్రామానికి చెందిన పిరమళ్ల సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

ఎస్.రాయవరం : బైకు పడిపోయినట్టుగా నటించి సహాయం చేయడానికి వచ్చిన వారి సెల్ ఫోన్లు దొంగలించే ఇద్దరు దొంగలను అరెస్టు చేసి చేసినట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు. విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఆవుల చక్రవర్తి, గంటా ఏసులను అడ్డురోడ్డులో పట్టుకుని సోమవారం అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ దొంగలు సెల్‌ఫోన్లతో పాటు గ్రామాల్లో నాటుకోళ్లను కూడా దొంగలిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. వీరి వద్ద నుంచి దొంగ బైకు, మొబైల్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఇసుక లారీ సీజ్

చోడవరం రూరల్: మండలంలోని ముద్దుర్తి జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు చోడవరం ఎస్ఐ అప్పలనాయుడు తెలిపారు. సోమవారం ఉదయం 6 గంట సమయంలో ముద్దుర్తి కొత్త పల్లి గ్రామానికి చెందిన పల్లా శ్రీను లారీలో రెండు యూనిట్ల ఇసుకను అక్రమంగా లోడు చేసి తరలిస్తుండగా తమ సిబ్బంది దాడి చేసి ఇసుక లారీని సీజ్ చేసి, లారీ డ్రైవర్ శ్రీనును అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



రంగవల్లులద్దుతున్న విద్యార్థినులు



సంప్రదాయ దుస్తుల్లో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

- సంప్రదాయ దుస్తుల్లో అధ్యాపకులు, విద్యార్థుల సందడి

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మకర సంక్రాంతి మూడు రోజుల ముందుగానే వచ్చేసింది. సోమవారం ఇక్కడ కళాశాల తెలుగు వారి లోగిళ్లుగా మారిపోయింది. భోగి మంటల చురచురలు, గాలి పటాల రెపరెపలు, పిండి వంటల ఘుమఘుమలతో సంక్రాంతి సందడి నెలకొంది. ఉపన్యాసకులందరూ అచ్చ తెనుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రాలలో సాక్షాత్కరించగా, విద్యార్థినులు కళాశాల ప్రాంగణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా భోగి మంటలు రాజేసి వణికిస్తున్న చలిపులిని తరిమేశారు. సిబ్బంది తెలుగువారి వంటకాల రుచిని పాట్‌లక్ పేరుతో అందరికీ పంచిపెట్టారు. తొలుత ఈ వేడుకలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కళాశాల సాంస్కృతిక విభాగం సమన్వయకర్త జి.వి.వి.ఎస్.వి. ప్రసాద్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారులు బి.లక్ష్మీపిచ్చమ్మ, మాల్యాద్రిల నేతృత్వంలో సాగిన వేడుకలలో వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఉపన్యాసకులు రఫీయుద్దీన్, సత్యనారాయణ, భూషణ్, అప్పలనాయుడు, కృష్ణారావు, రాంబాబు, రావిరాణి, సత్యవతి, మంగమ్మ, రామలక్ష్మి, సరస్వతి, శర్మ తదితరులు పాల్గొన్నారు. రంగవల్లులు తీర్చిదిద్దిన, సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పశువులను అపహరించిన ముగ్గురు అరెస్టు



నిందితులను చూపిస్తున్న సీఐ, ఎస్ఐ

బుచ్చెయ్యపేట : మండలంలో పలు గ్రామాల్లో పశువుల దొంగతనం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తకోట సీఐ సైయ్యద్ ఇలియాస్ మహమ్మద్, ఎస్ఐ కుమారస్వామి కథనం మేరకు ఇటీవల బుచ్చెయ్యపేట మండలం ఎల్.శింగవరం, కొమళ్లపూడి తదితర గ్రామాల్లో రాత్రిపూట పాడి గేదెలు, ఆవులు, దూడలను వ్యాన్‌కు ఎక్కించి తరలిస్తున్నారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు తమ సిబ్బందితో పలు సెంటరులో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకున్నామన్నారు. కాకినాడ జిల్లా తుని మండలం అన్నవరం దగ్గర సురవరం గ్రామానికి చెందిన కర్రి వీర దుర్గ వంశీ, తుని మండలం కొత్తపేటకు చెందిన వియ్యపు శ్రీనివాస్, తుని టౌన్ శ్రీనివాస సెంటర్‌కి చెందిన శానాపతి ప్రసాద్‌లను అరెస్టు చేశామన్నారు. బుచ్చెయ్యపేట మండలంతో పాటు చీడికాడ మండలం తునివలస, పెద గోగాడ గ్రామంలో కూడా వీరు పశువుల దొంగతనం చేసినట్టు నిందితులు ఒప్పుకున్నారన్నారు. వీరి వద్ద నుంచి ఏడు పశువులను స్వాధీనం చేసికుని బాధితులకు అప్పగించామన్నారు. నిందితులను కోర్టుకు తరలించామన్నారు. పశువుల దొంగతనానికి పాల్పడుతున్న ముఠా సభ్యులను పట్టుకున్న పోలీసులను సీఐ అభినందించారు.

బీజేపీ బలోపేతానికి చలపతిరావు కృషి ఎనలేనిది

- సంతాపసభలో వక్తలు



చలపతిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వక్తలు

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలకు కృషి చేసిన నాయకుడు పి.వి.చలపతిరావు అని వక్తలు కొనియాడారు. అఖిల పక్షాల ఆధ్వర్యంలో స్థానిక వేల్పులవీధి కల్యాణ మండపంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి వెంకట సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం పి.వి చలపతిరావు సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరరావు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా చలపతిరావు సేవలు అమోఘమన్నారు. అందరితో కలిసిపోయే మనస్తత్వం గల వ్యక్తిగా కొనియాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఉద్యమాల ఘనత ఆయనదేనన్నారు. మండలి సభ్యుడిగా రాణించిన నేతగా అభివర్ణించారు. అంతకుముందు పలువురు వక్తలు పి.వి.చలపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, సీపీఐ నాయకుడు వైఎస్.భద్రం, టీడీపీ, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

తండ్రి మరణంపై కుమార్తె ఫిర్యాదు



నర్సింహమూర్తి (ఫైల్)

దేవరాపల్లి : దేవరాపల్లిలో నివాసం ఉంటున్న ఈర్నె నర్సింహమూర్తి (55) సోమవారం మృతి చెందారు. తన తండ్రి మృతిపై తనకు అనుమానం ఉందని అతని కుమార్తె ఈర్నే రాజరాజేశ్వరి సోమవారం రాత్రి దేవరాపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర విలేకరులకు తెలిపారు. ఉద్యోగరిత్యా వేరే చోట ఉంటున్న కుమార్తె దేవరాపల్లిలో తన తండ్రి మరణించారని తెలిసిన వెంటనే తండ్రి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సోమవారం జరగాల్సిన అంత్యక్రియలను పోలీసులు నిలిపి వేశారు. కుమార్తె ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోను, భార్య విజయలక్ష్మి రాజమండ్రిలో ఉంటున్నట్టు సమాచారం. మృతుని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంగళవారం అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తామని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ఇదిలా ఉండగా విచారణలో భాగంగా మృతుడు నర్సింహమూర్తి ఆస్పత్రిలో చికిత్స పొందిన కేస్ సీట్లు ఇతర ధ్రువపత్రాలను పోలీసులు పరిశీలిస్తున్నట్టు సమాచారం.

'ఏ ఒక్క వర్గానికీ ప్రయోజనం లేదు'

నర్సీపట్నం: ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనలో ఏ ఒక్క వర్గానికి ప్రయోజనం లేదని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం ఒక వీడియోలో పేర్కొన్నారు. పండించిన ధాన్యమంతా కొంటామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. చెరకు రైతుల పాత బకాయిలకు దిక్కులేదన్నారు. ఉద్యోగస్తులకు సమయానికి జీతాలు ఇవ్వకపోవటం దురదృష్టకరమని, కనీసం పెన్షన్‌దారులకు సకాలంలో పెన్షన్ ఇవ్వాలన్నారు.

350 లీటర్ల సారా పులుపు ధ్వంసం



పులుపు ధ్వంసం చేసిన ఎస్ఐ తదితరులు

రావికమతం : గుమ్మాళ్లపాడు గ్రామ శివార్లలోని పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా 350 లీటర్ల పులుపును ధ్వంసం చేశామని రావికమతం ఎస్ఐ మామహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆ పరిసరాల్లో సారా తయారు చేస్తున్నారన్న ముందస్తు సమాచారం అందిన మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు.

మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

యలమంచిలి : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పాపినాయుడు తెలిపిన వివరాలు మేరకు యలమంచిలి పట్టణంలో యర్రవరం గ్రామానికి చెందిన తాప నాగేశ్వరావు అనే వ్యక్తి ఆరు మద్యం బాటిళ్లను తరలిస్తుండగా యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పట్టుబడ్డాడని, అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్ష నమూనా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌రెడ్డి

కశింకోట : జిల్లాలో ఈనెల 29న స్పందించిన హృదయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) నమూనా పరీక్షను మూడు కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు కశింకోట డీపీఎన్ స్కూల్ హెచ్‌ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఈ స్కూల్లో ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 7013912153 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు, ప్రతినిధి అప్పారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు వితరణ



దివ్యాంగులకు వస్త్రాలు అందజేస్తున్న నాగభూషణం, వెంకట సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం కోరారు. స్థానిక పిల్లావారి వీధిలో భీశెట్టి తనూజ ట్రస్ట్ ఆర్థిక సాయంతో సోమవారం దివ్యాంగులకు దుప్పట్లు, టిఫిన్ బాక్స్‌లు, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది బలహీన వర్గాల ప్రజలకు సేవా కార్యాక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. పేదలకు సహాయం చేయడంలో ఎంతో గొప్పతనం ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు భీశెట్టి వెంకట సత్యనారాయణ, వెంకట త్రివేణి, కర్రి లావణ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

రూ.4 లక్షలతో రహదారి నిర్మాణం



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లి రూరల్: తుమ్మపాల మేజర్ పంచాయతీ ఇందిరానగర్‌లో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు దంతులూరి దిలీప్‌కుమార్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4 లక్షలతో రహదారి పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. పనుల్లో నాణ్యతా లోపం లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పీడీ గాంధీ, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, చంద్రశేఖర్, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, వద్దాది భారతీ అశోక్, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, పడాలి గణపతి, ఆర్టీసీ సత్యనారాయణ, అడ్వకేట్ పిల్లా హరి శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ ప్రతినిధి సూరిశెట్టి శ్రీను, బీఎస్ఎన్ఎల్ కమిటీ మెంబర్ పీలా విశ్వేశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్ బంగారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 16,390 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,520	3,990
మొదటి రకం	3,210	3,600
రెండో రకం	3,850	3,250
మూడో రకం	2,800	3,000

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
ప్రత్యర్థి	- సత్యనారాయణ స్క్రీన్-1
అవతార్-2	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డీసాయి
అవతార్-2	- పర్తిసాయి
కింగ్‌డమ్ ఆఫ్ డైనోసార్స్(తెలుగు)	- వెంకటేశ్వర
లవ్ టుడే	- శ్రీసత్య
అవతార్-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్ 41 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్యను 91828 34480 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 452 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 438 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 94411 08144 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ప్రజలు మెచ్చేలా సీఎం పాలన



కశింకోటలో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు చేసి ఆశీర్వదిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- కశింకోటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కశింకోట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనను ప్రజలకు చేరువ చేశారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. కశింకోటలోని పూసర్ల వీధి, ఉప్పునీరు దిబ్బ, కస్పా వీధి, పందిరి వీధి ప్రాంతాల్లో సోమవారం ఆయన గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే రోడ్ల నిర్మాణానికి, కాలువలు, తాగునీరు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రికి జనమంతా మద్దతు నిలవాలని కోరారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

గర్భిణులకు సీమంతాలు..

ఇక్కడి రెండు అంగన్‌వాడీ కేంద్రాలను మంత్రి అమర్‌నాథ్ సందర్శించి గర్భిణులకు సీమంతాలు చేసి ఆశీర్వదించారు. పూలదండలు వేసి దుశ్శాలువాలు కప్పి ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఉప సర్పంచ్ లక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిశోర్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు యల్లపు లక్ష్మి, చెవ్వేటి చంద్రమ్మ, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ బి.సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్ పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి



జోబుదాస్‌ను సత్కరిస్తున్న క్రైస్తవ సంఘం ప్రతినిధులు

సబ్బవరం: పెందుర్తి నియోజకవర్గ క్రైస్తవ సోదరులకు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తప్పక నెరవేరుస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి జోబుదాస్ అన్నారు. సబ్బవరం సాయినగర్ కాలనీలోని జీసస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో సోమవారం మండలంలోని పాస్టర్స్ ఆత్మీయ సహవాస సమావేశంలో పాల్గొన్నారు. సంఘం ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై ఆయన స్పందిస్తూ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ క్రైస్తవుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తారని చెప్పారు. కమ్యూనిటీ హాల్, శ్మశానవాటిక విషయంలో ఎమ్మెల్యే స్పష్టతతో ఉన్నారని, అధికారులను ఆ దిశగా అప్రమత్తం చేశారని తెలియజేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల పెద్దలు జోబుదాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి ఆయన చేతులమీదుగా పంపిణీ చేశారు. సమావేశంలో సబ్బవరం మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి పువ్వుల విజయ్‌కుమార్, బి. వరప్రసాద్,డేవిడ్ లివింగ్ స్టన్,జాన్,డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై విచారణ జరపాలని వినతి



జాయింట్ కలెక్టర్ కల్పనకుమారికి వినతిపత్రం అందజేస్తున్న గనిశెట్టి

పరవాడ: ఫార్మాసిటీలో ఈ నెల 5న స్మైలెక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గనిశెట్టి సోమవారం అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. యాజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించని కారణంగానే ఈ ప్రమాదం సంభవించి కార్మికుడు మృతి చెందాడని ఆరోపించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రమాదాలకు కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఆర్డీవో స్పందనకు 31 అర్జీలు



ఫిర్యాదులు పరిశీలిస్తున్న ఆర్డీవో భవానీశంకర్

నర్సీపట్నం: స్పందన కార్యక్రమంలో 31 అర్జీలు వచ్చాయని ఆర్డీవో భవానీశంకర్ తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో ఆర్డీవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డివిజన్ పరిధిలోని 12 మండలాల నుంచి వివిధ సమస్యలపై 31 ఫిర్యాదులు వచ్చాయి. భూసమస్యలు, సదరం సర్టిఫికెట్లు కోసం ఎక్కువగా అర్జీలు సమర్పించారు. వీటిని ఎప్పకప్పుడు పరిష్కరించాలని ఆర్డీవో మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఆయా శాఖల అధికారులు జవాబుదారితనంగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదుదారులను పలుమార్లు తిప్పటం వల్ల అధికారులపై నమ్మకం పోతుందన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు ఎట్టిపరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. తహసీల్దార్ వి.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, సీడీపీవో మేరీ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

సబ్బవరం: మండలంలోని చింతగట్ల అగ్రహారంలో నాగరాజు అనే వ్యక్తి నీరుపారే కొండ గోర్జ దిశ మార్చి ఇంటి నిర్మాణం చేపట్టారని గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా కట్టడాన్ని నిలిపివేయాలని సూచించినా సదురు వ్యక్తి పట్టించుకోలేదని పేర్కొన్నారు. స్థల పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రమణ, సత్యం,వి అప్పారావు,ఆర్. సత్యం, బి. అచ్చెంనాయుడు తదితరులు ఉన్నారు.

యూడైస్‌పై హెచ్‌ఎంలకు అవగాహన



హెచ్‌ఎంలకు అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్లు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ, యూపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు సోమవారం మధ్యాహ్నం యూడైస్ (విద్యా వ్యవస్థ జిల్లా సంస్థాగత ప్రణాళికల) తయారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక హెచ్‌ఎం అప్పారావు ప్రారంభించి మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరంలో పాఠశాలల అభివృద్ధి, హ్యాబిటేషన్ ప్రణాళికల తయారీపై రిసోర్స్ పర్సన్లు బుడ్డిగ అప్పారావు, ఆకుల ఆనందరావు అవగాహన కల్పించారు. తరగతిల వారీగా విద్యాభివృద్ధి, ఆశించిన ఫలితాల సాధన, నూతన విద్యా విధానం, తదితర వాటిపై వివరించారు.

టెన్త్ విద్యార్థులపై దృష్టి పెట్టండి



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

మాకవరపాలెం: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ ఉపాధ్యాయులను ఆదేశించారు. గిడుతూరు ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేయడంతోపాటు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశా రు. మెనూ ప్రకారం భోజనం అందుతుందో లేదోనన్న విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ.. ఉతీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఇతర తరగతుల విద్యార్థుల సామర్థ్యంపై ఆరా తీశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



నవధాన్యాలతో వేసిన ప్రకృతి సాగు చిత్రపటాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ జయమ్మ తదితరులు

చీడికాడ: ప్రకృతి వ్యవసాయంతో అటు నేలకు, ఇటు రైతులకు ఆరోగ్యదాయకమని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. సోమవారం చీడికాడ తులసీ కళ్యాణ మండపంలో ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి సాగును ప్రోత్సహిస్తుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం లచ్చన్న మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు ముందు నవధాన్యాల సాగు వల్ల నేల సారవంతమవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయాధికారి హేమసుందర్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ యర్రా అప్పారావు, ఎంపీడీవో జయప్రకాష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



తాండవ ప్రాజెక్టు వద్ద పూర్వ విద్యార్థులు

నాతవరం: తాండవ హైస్కూల్‌లో 1995–96 బ్యాచ్ పదో తరగతికి చెందిన విద్యార్థులు సోమవారం తాండవ రిజర్వాయరు వద్ద సందడి చేశారు. ఇక్కడ ఆత్మీ య కలయికలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వీరు ఆటపాటలతో సందడి చేశారు, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. హైస్కూల్‌కు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని గురువులను సత్కరించుకోవాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం ప్రస్తుతం చదువుతున్న 49 మంది విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించి ఉపకరణాలు పంపిణీ చేశారు.

మురుగు కాలువ నిర్మాణం ప్రారంభం



ఎన్టీఆర్ కాలనీలో ప్రారంభమైన కాలువ పనులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ఎన్టీఆర్ కాలనీలో సోమవారం మురుగు కాలువ నిర్మాణ పనులు మొదలయ్యాయి. వీటిని ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవానీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీ ప్రజలు వినతి మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఒక్కో సచివాలయానికి నిధులు కేటాయింపులో భాగంగా నిధులు మంజూరు చేశారన్నారు. వీటితో కాలువ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లగిశెట్టి గణేష్, చిన్ని జనార్దన్, గుమ్మడి నారాయణరావు పాల్గొన్నారు.

పనుల కల్పనలో అలసత్వం వహిస్తే చర్యలు



తవ్వవానిపాలెంలో మామిడి మొక్కలకు రింగ్ ట్రెంచ్ పనులను పరిశీలిస్తున్న పీడీ సందీప్

సబ్బవరం: ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ. సందీప్ అన్నారు. మండలంలోని అమృతపురంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టిన మామిడి మొక్కలకు రింగ్ ట్రెంచ్ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. మండలంలో 4,800 మంది వరకూ ఉపాధి కూలీలు పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 7 గంటలకు ఉపాధి కూలీలంతా పనులకు హాజరు కావాలని సూచించారు.ఈ విషయంపై క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా తవ్వవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి పాఠశాలలో మొక్కలు పెంపకం చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పరమేష్,ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పరవాడ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అన్నారు. ధనుర్మాసం పురస్కరించుకొని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో మేలు కొలుపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇరు గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు. స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరవాడ నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, మండల ప్రచార ధర్మ కర్త వెన్నల అప్పలనాయుడు, కూండ్రపు అప్పలనాయుడు, కె.కృష్ణంనాయుడు, కె.ముత్యాలనాయుడు, గురుస్వామి రాజు, మాతృమూర్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాడుగుల వారపు సంతకు సంక్రాంతి శోభ



జనంతో కిక్కిరిసిన మాడుగుల వారపు సంత



మట్టి పాత్రలు కొనుగోలు చేస్తున్న జనం

మాడుగుల: సంక్రాంతి సందర్భంగా మాడుగులలో సోమవారం వారపు సంత కొనుగోలుదారులతో కిక్కిరిసి పోయింది. దేవాపురం, కక్కి, కొత్తూరు, డప్పడి, పంది గుంట, జీలికపాడు, అంటులోవ గిరిజన గ్రామాల నుంచి అరటితోపాటు కూరగాయలు, పసుపు, కందదుంపలు, రామఫలాలు, కొత్త చింత పండు, తదితర పంట ఉత్పత్తులు తీసుకొచ్చారు. సంతలో కారం, రడీమేడ్ దుస్తులు, పండుగకు కావలసిన నేత పంచెలు, కొత్త కుండలు, సిల్వర్ పాత్రలు కొనుగోలు చేసుకున్నారు. ఏజెన్సీ నుంచి వచ్చిన గిరిజనులు అధికంగా కొత్త దుస్తులు ఏడాదికి సరిపడా కొనుగోలు చేసుకున్నారు. అన్నిరకాల వస్తువులు, కొనుగోలుతోపాటు విక్రయాలతో సోమవారం ఒక్కరోజే కోటి రూపాయల వ్యాపారం జరిగి ఉంటుందని స్థానికలు చెబుతున్నారు.

హంస వాహనంపై వెంకన్న తిరువీధి సేవలు



హంస వాహనంలో తిరువీధి సేవలు నిర్వహిస్తున్న భక్తులు

నక్కపల్లి : ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం నిత్యార్చనలు అభిషేకాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు, వేణుగోపాలస్వామికి, ఆండాళ్లమ్మ వారికి విశేష పూజలు, బాల భోగనివేదన, రాజ భోగనివేదన నిర్వహించిన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను హంసవాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీది సేవలు నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు తీర్థగోష్టి నిర్వహించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 23వ పాశురాన్ని విన్నపం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు ఏకతాటిపైకి రావాలి



సమావేశంలో పాల్గొన్న సంఘ అధ్యక్షుడు తుంపాల గణేష్, సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): నాయీ బ్రాహ్మణులు ఒకే తాటిపైకి వచ్చి సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని నాయి బ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపాల గణేష్ అన్నారు. అచ్యుతాపురం మండల కేంద్రంలో సోమవారం మండల స్థాయి నాయీ బ్రాహ్మణుల సంఘం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎవరికైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని గణేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వడ్లపూడి అనిల్‌కుమార్, కేసనకుర్తి శివ, కోడూరు సింహాచలం, రాజాన రాము, అయినపర్తి శంకర్‌రావు, బయ్యవరపు సన్యాసిరావు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ

మునగపాక : దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ చల్లా భీమరాజు కోరారు. మునగపాకలోని ఎంఎస్ఆర్ డిగ్రీకళాశాల వద్ద సోమవారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నేటి సమాజంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఈవ్‌టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. యువత ఎవరైనా ఇబ్బందులు పెడితే స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. పలువురు విద్యార్థినులు సమావేశంలో పాల్గొన్నారు.